క్లుప్తంగా

సమస్యలుంటే తెలుపాలి



మిల్లర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

లక్సెట్టిపేట: ధాన్యం విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులున్నా రైతులు 6303928682, 6281978967, 9848339621 నంబర్లకు ఫోన్ చేసి సంబంధిత అధికారులకు తెలుపాలని అడిషనల్ కలెక్టర్ మోతీలాల్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని రైస్‌మిల్లులు, కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని మిల్లుల్లో వెంటనే అన్‌లోడింగ్ చేసుకోవాలన్నారు. అనంతరం రైస్‌మిల్లర్లతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బీఆర్‌ఎస్ ప్రచారం



తాటివనంలో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండలో శనివారం బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. పెద్దపల్లి ఎంపీగా కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. ఈజీఎస్ పనులు చేస్తున్న కూలీలను ఓటు అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మొగిలి శ్రీనివాస్, మాజీ సర్పంచులు జాడి సత్యం, గోళ్ల శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్, నాయకుడు రవి ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో స్కూల్‌డే



కన్నెపల్లిలో నృత్యం చేస్తున్న చిన్నారులు

దండేపల్లి: మండలంలోని గూడెం సెక్టార్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం స్కూల్‌డేను ఘనంగా నిర్వహించారు. కన్నెపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి పాల్గొని పిల్లల అభివృద్ధి, స్థాయి, పోషణ, పూర్వ ప్రాథమిక విద్య గురించి వివరించారు. అనంతరం పిల్లలు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలు పాటించాలి

నెన్నెల: ప్రతి ఒక్కరూ వేసవి జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు సూచించారు. శనివారం ఆయన నెన్నెల పీహెచ్‌సీని సందర్శించారు. ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆస్పత్రిలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఉపాధి కూలీలు, దినసరి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేయాలన్నారు. ఆయన వెంట ప్రోగ్రాం ఆఫీసర్ శివప్రసాద్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్, ఫార్మసిస్ట్ నారాయణ, ల్యాబ్‌టెక్నీషియన్ సుధీర్ ఉన్నారు.

ఇంద్రవెల్లి అమరులకు నివాళి

కాసిపేట: తుడుందెబ్బ మండల కమిటీ ఆధ్వర్యంలో గిరిజన రైతాంగ పోరాటంలో ఆసువులు బాసిన అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శనివారం దేవాపూర్‌లోని కుమురంభీం విగ్రహం వద్ద ఇంద్రవెల్లి అమరులకు నివాళులర్పించారు. తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడజంగు, నాయక్‌పోడు సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల బాపు, ఆదివాసీ విద్యాసంఘం జిల్లా అధ్యక్షుడు వెడ్మ కిషన్, తుడుందెబ్బ జిల్లా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ పేంద్రం హన్మంతు, నాయకులు జంగు, భూమయ్య, భీమ్‌రావు, లక్ష్మణ్, సూరు, ధర్మారావు తదితరులున్నారు.

రేషన్‌బియ్యం తరలిస్తున్న ఆటో పట్టివేత

తాండూర్: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఓ ఆటోను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిపై సబ్‌స్టేషన్ వద్ద శనివారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. కొల్లూరి శ్రీనివాస్ అనే ఆటో డ్రైవర్ రేషన్ బియ్యం అక్రమంగా తీసుకువెళ్తుండగా పట్టుకున్నారు. కాగా, శ్రీనివాస్ తాను రేషన్ బియ్యం ఆటోలో తీసుకెళ్తున్న సమాచారం తంగళ్లపల్లి గ్రామానికి చెందిన ఎర్ర శ్రీనివాస్ పోలీసులకు తెలుపాడని అనుమానించాడు. అతడి ఇంటికి వెళ్లి దాడికి యత్నించాడు. ఫజానా బేగం, అమీనా బేగం, టీనా బేగం మరికొందరు శ్రీనివాస్‌పై దాడికి యత్నించినట్లు ఎస్సై తెలిపారు. శ్రీనివాస్ తప్పించుకుని పోలీస్‌స్టేషన్‌కు వచ్చినట్లు పేర్కొన్నారు. సదరు వ్యక్తులు కూడా ఠాణాకు వచ్చి శ్రీనివాస్‌ను అప్పగించాలని దుర్భాషలాడి పోలీస్ విధులకు ఆటంకం కలిగించినట్లు తెలిపారు. దీంతో ఫజానా బేగం, అమీనా బేగం, టీనా బేగంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

భవన నిర్మాణం పూర్తయ్యేనా?

- 'ఇంటిగ్రేటెడ్' బిల్డింగ్ పనుల్లో జాప్యం
- రోడ్లపైనే కొనసాగుతున్న వారసంత
- ఇబ్బందుల్లో స్థానికులు, వ్యాపారులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు భవన నిర్మాణం

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని పాతబస్టాండ్ ప్రదేశంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభించి రెండేళ్లయినా నేటికీ పూర్తి కాలేదు. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వం మారినా పనులు పూర్తి చేయకపోవడమేమిటనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ పరిధిలో ఆది, గురువారాల్లో సంత నిర్వహిస్తారు. ఆదివారం పాత బస్టాండ్ అంగడిబజార్, గురువారం అంబేద్కర్ చౌరస్తా ప్రదేశంలో సంత నిర్వహిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి కావడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది.

నత్తనడకన సాగుతున్న పనులు

మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న మార్కెట్ యార్డు నిర్మాణ కోసం టీయూఎఫ్‌ఐడీసీ పథకం కింద ప్రభుత్వం రూ.3.90 కోట్ల నిధులు మంజూరు చేసింది. చికెన్, మటన్ దుకాణాలు, కూరగాయల మార్కెట్.. ఇలా అన్ని ఒకే ప్రదేశంలో ఉండేందుకు వీలుగా నిర్మాణం చేపట్టారు. కానీ.. పనుల్లో జాప్యం జరుగుతుండడంతో వినియోగదారులు, అమ్మకందారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రోడ్డు పక్కనే విక్రయాలు కొనసాగిస్తుండగా వాహనదారులు, పాదచారులకు ఇక్కట్లు తప్పడంలేదు. అంబేద్కర్ చౌక్ సమీపంలో నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఈ ప్రదేశంలో సంత నిర్వహిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతుండగా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



గురువారం అంబేద్కర్ చౌక్‌లో రోడ్డుపైనే నిర్వహిస్తున్న వార సంత

త్వరలో పూర్తి చేయిస్తాం

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు భవన నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. కాంట్రాక్టర్ కొన్ని కారణాలతో పనులు నిలిపేశాడు. భవనం స్లాబ్ వరకు పూర్తయింది. టైల్స్, పెయింటింగ్ పనులు వెంటనే పూర్తి చేయించి త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్

'అభివృద్ధిలో విజయ డెయిరీ'

లక్సెట్టిపేట: పాల సేకరణలో విజయ డెయిరీ అభివృద్ధిలో ఉందని డెయిరీ ఉప సంచాలకుడు మధుసూధన్‌రావు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని విజయ డెయిరీని సందర్శించి మాట్లాడారు. గత వేసవిలో ఉన్న ఉత్పత్తి, సరఫరా ప్రస్తుత సంవత్సరం కూడా ఉందని తెలిపారు. ఎలాంటి తగ్గుదల లేకుండా పాల సేకరణలో చాలా అభివృద్ధి చెందిందన్నారు. సిబ్బంది పాల అమ్మకాలు, నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎలాంటి సమస్యలున్నా తెలుపాలని, ప్రతి ఒక్కరూ సక్రమంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం డెయిరీని పరిశీలించి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆయన వెంట డెయిరీ మేనేజర్లు సతీశ్, దస్రునాయక్, సిబ్బంది వినోద్, సత్యనారాయణ, నవీన్ తదితరులున్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న మధుసూధన్‌రావు

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని వినతి

మంచిర్యాలఅర్బన్: మదర్‌థెరిసా పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని బీజేవైఎం నాయకులు విద్యాశాఖ పర్యవేక్షణాధికారి సత్యనారాయణకు శనివారం వినతిపత్రం అందజేశారు. హనుమాన్ మాల ధరించిన విద్యార్థులను అవమానించిన పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్, పట్టణాధ్యక్షుడు సత్యనారాయణ, నస్పూర్ పట్టణ ప్రధాన కార్యదర్శి సాగర్ తదితరులున్నారు.

ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం

మంచిర్యాలఅర్బన్: స్థానిక హమాలీవాడ చెరువు కట్టపై పోచమ్మ ఆలయం సమీపాన శనివారం 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణాన్ని హనుమాన్ దీక్షా పరులు పఠించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గంగాధర్

చెన్నూర్: స్థానిక పెద్ద చెరువు కట్ట వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ గంగాధర్ శనివారం ప్రారంభించారు. పర్యావరణశాఖ ఇంజినీర్ హరికాంత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



నెన్నెల: హోమంలో పాల్గొన్న భక్తులు

నెన్నెల: మండలంలోని గంగారంలో శనివారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ సుధ–శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పూజలు కొనసాగగా చివరిరోజు హోమం, విగ్రహ ప్రతిష్ఠాపనను వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



మంచిర్యాలఅర్బన్: పూజలు చేస్తున్న భక్తులు

మంచిర్యాలఅర్బన్: రాళ్లపేట్ రోడ్‌నంబర్–1లో నూతనంగా నిర్మించిన శివపంచాయతన ఆలయంలో రెండోరోజూ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగాయి. శనివారం వేదపండితులు మధుశంకర శర్మ, కొత్తపల్లి భరద్వాజశర్మ, శ్రీరాంభట్ల శశాంక్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమంఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యాత్రను విజయవంతం చేయండి

నస్పూర్: ఈ నెల 23న జిల్లా కేంద్రంలో వీహెచ్‌పీ భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో తలపెట్టిన వీర హనుమాన్ విజయయాత్రను విజయవంతం చేయాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రేవెల్లి రాజలింగు, వేముల రమేశ్ కోరారు. శనివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. యాత్ర జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా వద్ద మధ్యాహ్నం 5 గంటలకు యాత్ర ప్రారంభమై వెంకటేశ్వర టాకీస్ చౌరస్తా, అర్చన టెక్స్ చౌరస్తా, మార్కెట్, పోలీస్‌స్టేషన్, రైల్వేస్టేషన్ మీదుగా ముఖరాం చౌరస్తాలోని శ్రీలక్ష్మీ నారాయణ ఆలయం వద్ద ముగుస్తుందని తెలిపారు. జిల్లాలోని ఆంజనేయ స్వామి దీక్షాపరులు, హనుమాన్ భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యక్షులు గొట్టపతి కనకతార, కోశాధికారి పాదం రవీందర్, మంచిర్యాల నగరకార్యదర్శి కొండపర్తి సంజీవ్, భజరంగ్‌దళ్ బెల్లంపల్లి నగర అధ్యక్షుడు ఉప్పలేటి రాజేశ్, విద్యాసాగర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

జన్నారంలో బీజేపీ ప్రచారం



కూరగాయల వ్యాపారికి కరపత్రం ఇస్తున్న నాయకులు

జన్నారం: జన్నారం మండలంలో బీజేపీ మండలాధ్యక్షుడు మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు శంకరయ్య, తిరుపతి, సూర్యం, వీరాచారి, సురేశ్, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

భీమిని: మండలంలోని మల్లీడి మాజీ సర్పంచ్ నిధులు దుర్వినియోగం చేశారంటూ శనివారం మాజీ వార్డు సభ్యులు, గ్రామస్తులు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 2019–2023 ఆర్థిక సంవత్సరంలో గ్రామసభ తీర్మానం లేకుండానే పనులు చేపట్టి అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

మే డే పోస్టర్ ఆవిష్కరణ

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం మే డే ఉత్సవాల పోస్టర్‌ను ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు ఆవిష్కరించారు. మేడే వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, ఉపాధ్యక్షులు మిట్టపల్లి పౌలు, రాజమల్లు, మెడికల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు రాయమల్లు, మధుకర్, రాకేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బీజేపీ ఇంటింటి ప్రచారం



కరపత్రం పంపిణీ చేస్తున్న నాయకులు

భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం బీజేపీ మండల ఇన్‌చార్జి అలం బాపు ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థించారు. పెద్దపల్లి ఎంపీగా గోమాస శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. బీజేపీ యూత్ మండలాధ్యక్షుడు సెగ్యం సందీప్, శక్తికేంద్రం ఇన్‌చార్జి ఆకుదారి శంకర్, నాయకులు కత్తరశాల, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రక్తదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సభ్యులు మాట్లాడుతూ.. తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ద్వారా ఉచితంగా రక్తం అందిస్తున్నామని తెలిపారు. విద్యుత్‌శాఖ ఉద్యోగులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్, ఏడీ టెక్నికల్ తిరుపతి, సత్తిరెడ్డి, శ్రీనివాస్, రాంగోపాల్‌రెడ్డి, రాజన్న, రెడ్‌క్రాస్ చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి చందూరి మహేందర్, కాసర్ల రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

నాణ్యమైన ధాన్యం తేవాలి

దండేపల్లి: కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన వరి ధాన్యం తేవాలని అదనపు కలెక్టర్ మోతీలాల్ రైతులకు సూచించారు. వెల్గనూర్‌లోని కొనుగోలు కేంద్రాలను శనివారం సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అదనంగా మరో సెంటర్ ఏర్పాటు చేయాలని, సెంటర్లలో కాంటాల సంఖ్య పెంచాలని రైతులు కోరారు. కొనుగోలు కేంద్రాల స్థల సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని అదనపు కలెక్టర్ నిర్వాహకులకు సూచించారు. కొనుగోళ్లు వేగవంతం చేసి తూకం వేసిన బస్తాను మిల్లులకు తరలించాలన్నారు. అనంతరం కన్నెపల్లి సమీపంలోని రాధాకృష్ణ రైస్‌మిల్‌ను సందర్శించారు. ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేయాలని మిల్లు యజమానికి సూచించారు. డీపీఎం వేణుగోపాల్, తహసీల్దార్ సంధ్యారాణి ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అదనపుకలెక్టర్

ఒలింపియాడ్ పరీక్షలో ప్రతిభ

మంచిర్యాలఅర్బన్: స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో ఇటీవల నిర్వహించిన ఐఎస్‌టీయస్‌వో ఒలింపియాడ్ పోటీ పరీక్షలో పలువురు విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచారు. నల్ల అక్షయ గ్రాండ్ ప్రైజ్‌గా ల్యాప్‌టాప్, శ్రీతం రెడ్డి ద్వితీయ స్థానంలో ట్యాబ్ బహుమతులు సాధించారు. విఖ్యాతరాణా నాలుగో బహుమతి, సన్‌శ్రీ ఐదో బహుమతి, 59 మంది విద్యార్థులు గోల్డ్‌మెడల్‌తో పాటు సర్టిఫికెట్లు పొందారు. 23 మంది కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. వీరిని శనివారం స్థానిక శాసనసభ్యుడు ప్రేంసాగర్‌రావు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జోబిన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు

డాట్ 4 మార్ట్ ప్రారంభం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని లక్సెట్టిపేట రోడ్డులో ఏర్పాటు చేసిన డాట్ 4 మార్ట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మునీర్ మాట్లాడుతూ.. మార్ట్‌లో నాణ్యమైన వస్తువులతో సూపర్ మార్కెట్, బేకరీ, ఫుడ్‌కోర్టులు, హౌజ్ హోల్డ్ వస్తువులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రూ.2,500, రూ.4,500, రూ.7,500 విలువైన సామగ్రి కొనుగోలు చేసిన వారికి ఫ్రీగిఫ్ట్‌లు అందించనున్నట్లు పేర్కొన్నారు. డాట్ 4 మార్ట్‌ను ఆదరించాలని కోరారు. కౌన్సిలర్ బానేశ్, సర్పంచ్ సునీత సుధాకర్, బీజేపీ నాయకుడు పెట్టం తిరుపతి, వ్యాపారవేత్త సుధాకర్, డాట్ 4 మార్ట్ డైరెక్టర్లు జునైస్, ఆదిల్, షరపుద్దీన్ పాల్గొన్నారు.



డాట్ 4 మార్ట్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్లు

ప్లాస్టిక్ పైపులతో పర్యావరణానికి ముప్పు

మంచిర్యాలటౌన్: ఎన్నో ఏళ్లుగా డ్రెయినేజీల కోసం వాడుతున్న ఎస్‌డబ్ల్యూజీ పైపులను కాదని పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టిక్ పైపులను వాడితే ప్రకృతికి నష్టం జరుగుతుందని, సిరామిక్స్ పరిశ్రమలకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని ఆ పరిశ్రమల యజమానులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం తెలంగాణ ఎస్‌డబ్ల్యూజీ పైప్ మ్యాను ఫ్యాక్చరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పీ వరప్రసాద్ విలేకరులతో మాట్లాడారు. మట్టి పైపులు ఉత్పత్తి చేస్తున్న చిన్నపరిశ్రమలు తెలంగాణలో 36 ఉండగా ఇందులో మంచిర్యాల జిల్లాలోనే 26 ఉన్నాయన్నారు. ఇక్కడి మట్టి, సింగరేణి బొగ్గుతో నాణ్యతతో కూడిన పైపులు తయారు చేస్తూ రాష్ట్రం మొత్తానికి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఎస్‌డబ్ల్యూజీ పైపులను 65 శాతం సిలికా, 25శాతం అల్యూమినియం కలిగిన తెల్ల మట్టితో వివిధ పరిమాణాల్లో తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వాటిని వెయ్యి నుంచి 1,050 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు బట్టీల్లో కాల్చుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పనుల్లోనూ ప్లాస్టిక్ పైపులు వాడుతున్నారని, దీంతో తమ పరిశ్రమల్లో పని చేసే నాలుగువేల మంది ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. దీనిపై సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. పీ హన్మంతరావు, శ్రీనివాసరెడ్డి, ఆర్ సుధాకర్‌రావు, ఏ తిరుపతి, సీహెచ్ సుధాకర్, వాసుదేవాచారి, గోపాల్, మల్లేశం పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పరిశ్రమల యజమానులు

గురుకులాలకు ఎంపిక



చెన్నూర్‌రూరల్: సీటు సాధించిన విద్యార్థులు

చెన్నూర్‌రూరల్: అంగ్రాజ్‌పల్లి గ్రామంలోని వివేకానంద విద్యామందిర్ పాఠశాలకు చెందిన 16మంది విద్యార్థులు గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పిట్టల రాజశేఖర్, కరస్పాండెంట్ కే మణికంత తెలిపారు. సీట్లు సాధించిన పాగె పార్థుకుమార్, నరిగె వర్షిణి, గజ్జల మనస్విని, జిముడ చైత్ర, రత్న వర్షిత్‌రెడ్డి, గొరిగె కృతిక, వసంత హర్షిత, బూసరి మనోజ్, జక్కుల శ్రీవిద్య, బండం సాహిత్య, బోరం రుత్విక్, జాడి అవినాష్, ఆకుదారి అన్వేశ్, బండారి సాయికిరణ్, చెరుకు ధనుష్, కొండగొర్ల వరుణ్‌తేజను శనివారం ఉపాధ్యాయులు అభినందించారు.

భీమారం: మండలంలోని కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన తొమ్మిదిమంది విద్యార్థులు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఎంపికయ్యారు. 12 మంది పరీక్షకు హాజరు కాగా, అన్నమొల ఉషస్సు, అన్నమొల స్వరాజ్ఞ, దుర్గం ఆద్రిక్‌ద్రోణ, జేగేటి పృథ్వీరాజ్, కామెర కౌషిక్, కుమ్మరి మణిశర్మ, కొండ శరత్‌కుమార్, లింగాల ప్రత్యూష ఎంపికైనట్లు హెచ్‌ఎం అలివేణి తెలిపారు. వీరిని శనివారం ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



భీమారం: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జన్నారం: కలమడుగు గ్రామంలోని వివేకానంద పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు గురుకులాల్లో ప్రవేశానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సతీశ్‌గౌడ్, ఇన్‌చార్జ్ తిరుపతి తెలిపారు. వీరిని ఎంఈవో విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

ఘనంగా నాగవెల్లి

భీమారం: మండల కేంద్రంలోని శ్రీకోదండరామాలయంలో శనివారం రాత్రి శ్రీసీతారాముల నాగవెల్లిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవాసమితి భక్తులు భజన చేశారు. అర్చకుడు ప్రవీణ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని మూడో జోన్‌లోగల సీతారామచంద్ర ఆలయంలో సీతారాముల నాగవెల్లిని ఘనంగా నిర్వహించారు. అర్చకుడు వెంకటేశ్వరాచారి ప్రత్యేక పూజలు చేశారు.



మందమర్రి రూరల్: కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ముస్లింల భిక్ష

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి గ్రామంలో ముస్లిం మైనార్టీ నాయకుడు నుర్తుజ ఆధ్వర్యంలో హన్మాన్ దీక్షాపరులకు శనివారం భిక్ష ఏర్పాటు చేశారు. మండల కో ఆప్షన్ సభ్యుడు సిలార్ ఖాన్, రహ్మాన్, షారూక్, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.